సాక్షి
కాకినాడ
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



కౌలుకోలేక..

పొగాకు భూముల కౌలు, బ్యారన్ల లీజులు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


8లో



మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న 20 ఏళ్ల యువకుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 5,47,004 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 10,300 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

జిల్లాకు పిఠాపురం రాజా పేరు పెట్టాలి

బోట్‌క్లబ్: ప్రస్తుత కాకినాడ జిల్లా పేరును పిఠాపురం రాజా జిల్లాగా మార్చాలని కవి, చరిత్ర పరిశోధకులు, రచయిత ర్యాలి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీలో సాంస్కృతిక సాహిత్య కళా రంగాలకు, సంఘ సంస్కరణకు, దళిత జనోద్ధరణకు ఆంధ్ర భోజ పిఠాపురం మహారాజా రావు సూర్యారావు విశేషంగా కృషి చేశారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక విద్యాసంస్థలు స్థాపించారన్నారు. సామాజిక విప్లవానికి కృషి చేశారన్నారు. వందలాది కవులను పోషించి తెలుగు సాహిత్యానికి ఏ ఇతర సంస్థానాధీశులు చేయనంత భాషా సేవ చేశారన్నారు. ప్రాచీన సాహిత్యాన్ని వెలికితీసే క్రమంలో ఆంధ్ర సాహిత్య పరిషత్ స్థాపించారన్నారు. మహాత్మాగాంధీ చేపట్టిన మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి ముందే మద్యపానాన్ని నిషేధించారన్నారు. కాకినాడ పట్టణాన్ని నగరం తీర్చిదిద్దడంలో ఆయనది ప్రధానమైన పాత్ర అన్నారు.

హత్య కేసులో భార్యాభర్తలకు పదేళ్ల జైలు

పెద్దాపురం: హత్య కేసులో భార్యాభర్తలకు పదేళ్ల జైలుశిక్షను కోర్టు విధించినట్లు పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ తెలిపారు. 2022 సంవత్సరంలో మండలంలోని జి.రాగంపేటకు చెందిన ఆదిన ప్రసాద్, అతని భార్య లక్ష్మి సరిహద్దు తగాదాల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో పాలాని మంగను ఇంటి మెట్లపై నుంచి తోసివేయడంతో ఆమె మృతి చెందింది. మృతురాలి కుమార్తె కర్రెళ్ల పాపారత్నం పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో అప్పటి సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదోపవాదనలు జరిగి నేరం రుజువు కావడంతో నిందితులకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దైవకృప పదేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి పది వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో ఏపీపీ గుణ్ణంరాజు వినయ్‌తేజ, రాగం కామేశ్వరరావు వాదనలు వినిపించారు.

ఈ - క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ధాన్యం సేకరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ 2025–26లో ధాన్యం సేకరణ సన్నద్ధతలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జేసీ రాహుల్ మీనా, వ్యవసాయం, పౌరసరఫరాలు, సహకార, ఏపీఈపీడీసీఎల్, లీగల్ మెట్రాలజీ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ– క్రాప్ నమోదు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు, రైతు సేవ కేంద్రం వారీగా గోనెసంచుల నిల్వలు, హమాలీలు, రైస్ మిల్లులు తనిఖీలు వంటి అంశాలపై జేసీ అధికారులతో చర్చించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పండించిన పంట రకం, సాగు విస్తీర్ణం వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సక్రమంగా నమోదు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 60 శాతం ఈ–క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన రైతుల వివరాలను కూడా ఈ– క్రాప్ లో నమోదు చేయాలని జేసీ అధికారులకు స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కేంద్రంలో పనిచేసే సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు అనుగుణంగా అవసరమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు రైస్ మిల్లులను అనుసంధానం చేసే ప్రక్రియ చేపట్టి తనిఖీలు నిర్వహించాలని జేసీ అధికారులకు సూచించారు.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా జానకీ దేవి

కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా సీహెచ్ జానకి దేవిని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జానకి దేవి నంద్యాలలో జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఐజీగా నియమితులయ్యారు.

నేడు జరగాల్సిన ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో బుధవారం స్థానిక డీఎస్ఏ మైదానంలో జరగాల్సిన నెట్‌బాల్, రగ్బీ అండర్–14, 17 ఎంపికలు వర్షం కారణంగా వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి తెలిపారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో ఎంపికలు యథావిధిగా జరుగుతాయన్నారు. నెట్‌బాల్, రగ్బీ తేదీలు ప్రకటిస్తామని సమాఖ్య కార్యదర్శులు తెలిపారు.

ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తుతుంది. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి, ఇతర పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– కుడుపూడి పార్థసారథి, అధ్యక్షుడు, ది.రాజమండ్రి ప్రెస్‌క్లబ్



కేసులు పెట్టడం సరికాదు



అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ప్రజావ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రభుత్వంలోని లోటుపాట్లను ఎత్తిచూపిన వారిపై కేసులు నమోదు చేయడం సరికాదు. వెంటనే సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి, పాత్రికేయులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలి.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

సచివాలయ ఉద్యోగుల అల్టిమేటం

- ఆత్మగౌరవం లేకుండా పనిచేయలేం
- సర్వేల పేరుతో ఇంటింటికీ తిరగలేకపోతున్నాం
- డిమాండ్ల పరిష్కారానికి సర్కార్‌కు 15 రోజుల డెడ్‌లైన్
- లేదంటే అక్టోబర్ 1 నుంచి నిరవధిక సమ్మె



గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉన్నత చదువులు చదువుకుని పండగలు, పబ్బాలు లేకుండా వారాంతంలో సెలవు లేకుండా ఇంటింటికీ తిరిగి ఆత్మ గౌరవం చంపుకొని ఉద్యోగం చేయలేక సచివాలయ ఉద్యోగులు నరకం చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా సర్వేలపై సర్వేలు చేయిస్తూ ఉద్యోగం వదిలి పారిపోయేలా చేస్తోందని మండిపడుతున్నారు. ప్రభుత్వ నిర్వాకంతో ఉద్యోగంలో కొనసాగడంపై సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. చదివింది ఉన్నత విద్య అయినా ఏ ఉద్యోగం, ఉపాధి లేని పరిస్థితుల్లో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగాలతో గౌరవ ప్రదమైన హోదా కల్పించారు. సర్వీసు రూల్స్ వర్తింపచేసి ఉద్యోగాలు కూడా రెగ్యులరైజ్ చేశారు. ఇందుకు సచివాలయ ఉద్యోగులంతా జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞులై ఉన్నారు. సచివాలయంలో ఉద్యోగమంటే సమాజంలో గుర్తింపు, నలుగురికీ సేవలందించే అవకాశం లభించిందని సచివాలయ ఉద్యోగులు చాలా సంతోషించారు. ప్రభుత్వం మారిందే తడవుగా సర్వేలపై సర్వేలు, అదనపు బాధ్యతలు, అనవసర ఒత్తిళ్లు, ఇంటింటికీ తిరుగుతుంటే ఎదురవుతోన్న అవమానాలపై సచివాలయ ఉద్యోగులు కూటమి సర్కార్‌పై సమరశంఖం పూరించేందుకు సమాయత్తమవుతున్నారు. డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి కొంత గడువు ఇచ్చారు. వచ్చే నెల ఒకటో తేదీ డెడ్‌లైన్‌గా నిర్ణయించారు. ఈ మేరకు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధికారులకు నివేదించి సమ్మెకు సమాయత్తమవుతోంది. ఇంటింటికీ వెళ్లి పనిచేసే విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్లలో ప్రధానంగా ఉంది. ఇందుకు రెండు వారాలు గడువు ఇస్తూ వచ్చే నెల ఒకటి నుంచి సచివాలయ ఉద్యోగులు మూకుమ్మడిగా సమ్మెకు సిద్ధమవుతున్నారు.

వేధింపులతో సమ్మె యోచన

21కి పైగా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయిలో ప్రజా సమస్యలపై స్పందిస్తోన్న మొట్టమొదటి వ్యవస్థ గ్రామ, వార్డు సచివాలయాలు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు పొందిన వారిలో కొంతమందిని కూటమి ప్రభుత్వం అడుగడుగునా వేధిస్తుండడంతో తిరుగుబాటు బావుటా ఎగరేశారు. సచివాలయ ఉద్యోగుల పట్ల వ్యతిరేక ధోరణితో ఉన్న నేపథ్యంలో వారంతా ప్రభుత్వంపై నిరసన గళం వినిపిస్తున్నారు. అయినా ప్రభుత్వం వైపు నుంచి చలనం రాకపోవడంతో వచ్చే రెండు వారాల్లో సమస్యలు పరిష్కరించాలనేది వారి అల్టిమేటం.

అదనపు బాధ్యతలతో నరకం

కాకినాడ జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. కాకినాడ నగరపాలక సంస్థతో పాటు తుని, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పట్టణాలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగర పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు, 445 గ్రామ సచివాలయాలు, 175 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో జిల్లా అంతటా కలిపి 5,580 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 14వేల మంది వలంటీర్లు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందజేసేవారు. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ఇతర ఆదేశాలు కూడా క్షేత్రస్థాయిలో అమలు చేసేవారు. కూటమి ప్రభుత్వం గద్దె నెక్కాక సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పి చెప్పాపెట్టకుండా వలంటీర్ల వ్యవస్థపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. ఇన్ని వేల మంది అందించే విధులను సచివాలయాల ఉద్యోగులకు అప్పగించి అదనపు భారం మోపింది. ఇలా అదనపు బాధ్యతలతో సచివాలయ ఉద్యోగులు నరకం చూస్తున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పేరిట కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పరిపాలన విధానంలో ఇంటింటికీ ప్రభుత్వ సేవలందించేలా కార్యక్రమాలతో పాటు సర్వేల బాధ్యతలను సచివాలయ ఉద్యోగులే చేయాల్సి వస్తోంది. రోజువారీ సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన పనులతోపాటు ఇంటింటికీ విధులు తమకు ప్రాణసంకటంగా పరిణమించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధి నిర్వహణకు ప్రతిబంధకంగా..

సమాజంలో గౌరవప్రదంగా ఉంటుందనే ఉద్దేశంతో ఉద్యోగాల్లో చేరగా ఇప్పుడు నరకం కళ్ల చూస్తున్నామని సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. సర్వేలే విధి నిర్వహణకు పెద్ద ప్రతిబంధకంగా మారాయంటున్నారు. సోమవారం, గురువారం పాఠశాలల్లో టాయిలెట్స్‌పై సర్వే చేయాలనే ఆదేశాలు తలకుమించిన భారమవుతున్నాయి. ఒక సచివాలయ ఉద్యోగి పరిధిలో నాలుగైదు హేబిటేషన్స్ ఉండటంతో అన్ని పాఠశాలల్లో సర్వే ఇబ్బందిగా ఉందంటున్నారు. అలాగే ఇంటి పన్ను నిర్ధారణ సర్వే కోసం ప్రతి ఇంటికీ వెళ్లి టేపుతో కొలతలు తీయాల్సి రావడం పెద్ద సమస్యగా మారింది. ఇంటింటికీ వెళ్లి కొలతలు తీస్తుంటే స్థానికుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేల నుంచి తమను తప్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులను మాతృ శాఖలకు బదలాయించాలంటున్నారు. ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా ఒత్తిడి తీసుకు వచ్చి ఉద్యోగాలు చేసే విధానానికి స్వస్తి పలకాలంటున్నారు. ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్ సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానెళ్లు ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలని కోరుతున్నారు.

ఉద్యమానికి సన్నద్ధం

రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యమానికి సచివాలయ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. డిమాండ్ల సాధనకు అధికారులకు వినతిపత్రాలు అందచేసే ప్రక్రియకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. పలు మండలాల్లో సచివాలయ ఉద్యోగులు మండల స్థాయిలో అధికారులకు నివేదించారు. ఫలితంగా నిరసనల స్థాయి పెంచాలని సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నిర్ణయించింది. అందుకే 15 రోజుల తర్వాత సమ్మెకు వెళతామని అల్టిమేటం ఇచ్చింది.

బలవంతపు విధులు వద్దు



ప్రతిసారి ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం వల్ల సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలుగుతోంది. విద్యార్హతల ఆధారంగా విధులు అప్పగించాలి. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు నుండి విముక్తి కల్పించాలి. సెలవుల్లో బలవంతపు విధులు నిర్వహించే విధానానికి స్వస్తి పలకాలి.

– విప్పర్తి నిఖిల్‌కృష్ణ, రాష్ట్ర సెక్రటరీ జనరల్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక

ప్రమోషన్ చానల్స్ ఏర్పాటు చేయాలి



ఇంటింటికీ తిరిగే పనులు, సర్వేల నుంచి విముక్తి కల్పించాలి. ఉద్యోగులను మాతృ శాఖల్లో విలీనం చేయాలి. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి. అన్ని విభాగాల వారీ ప్రమోషన్ చానల్స్ ఏర్పాటు చేయాలి.

– బీర జాన్ క్రిస్టోఫర్, సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా

సుప్రీంకోర్టు స్టే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

బోట్‌క్లబ్: వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీం ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ముస్లిం సమాజం స్వాగతిస్తోందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జోనల్ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. ఆయన మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ముస్లిం వర్గానికి వక్ఫ్ సీఈవో పదవి ఇవ్వాలని కోర్టు సూచించిందన్నారు. ఈ సవరణ చట్టం ఉభయ సభల్లో ప్రవేశపెట్టినప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సమాజానికి అండగా ఉండి బిల్లుకు వ్యతిరేకంగా ఎంపీలందరూ ఓటు వేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అనుకూలంగా ఓటు వేసి బిల్లు ఆమోదముద్ర పడే విధంగా సహకరించి ముస్లిం సమాజానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. కానీ ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కేసులు వేశారన్నారు. దీంతో సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకొని విచారించి వక్ఫ్ సవరణ చట్టంపై స్టే ఇచ్చిందన్నారు. ఈ సవరణ చట్టంలో ఎన్నో లొసుగులు ఉన్నాయని తద్వారా ముస్లిం సమాజానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన అంశాల్లో భాగంగా ఆస్తి హక్కు పరిరక్షణ, యాధృచ్ఛిక అధికారాల నివారణ, అధికారాల విభజన, ముస్లిమేతర సభ్యత్వం వంటి పలు అంశాలపై స్టే విధించిందన్నారు.. అయితే కొత్త సవరణ చట్టం వక్ఫ్ ఆస్తులను, హక్కులను, బలహీనపరిచే విధంగా ఉంది కనుక వక్ఫ్ సవరణ చట్టం 2025 ను రద్దుచేసి పాత వక్ఫ్ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు.



అబ్దుల్ బషీరుద్దీన్

పంపా పరవళ్లు



వరద నీటితో నిండిన పంపా రిజర్వాయర్

వంద అడుగులకు చేరిన నీటిమట్టం

అన్నవరం: రెండ్రోజులుగా భారీ వర్షాలు కురియడంతో అన్నవరంలోని ‘పంపా’ రిజర్వాయర్‌లోకి భారీగా వర్షపు నీరు వస్తోంది. ఫలితంగా రిజర్వాయర్ నీటిమట్టం మంగళవారం సాయంత్రం వంద అడుగలకు చేరుకుంది. పంపా గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు. పంపా క్యాచ్‌మెంట్ ఏరియా అయిన శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్‌లోకి 700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.35 టీఎంసీ నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. పంట కాల్వల ద్వారా 500 క్యూసెక్కులు ఆయకట్టుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మరో వంద క్యూసెక్కుల నీరు బ్యారేజీ గేట్ల లీకేజీ ద్వారా సముద్రానికి వెడుతున్నట్టు తెలిపారు. పంపా నీటిమట్టం ఇంకా పెరిగితే బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఇరిగేషన్ డివిజన్ ఈఈ జీ శేషగిరిరావు తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి




జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఫెడరేషన్ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. సీపీఎస్ రద్దు చేయాలని, యాప్‌లను, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని విడుదల చేయాలన్నారు. ఈసీహెచ్‌ఎస్ పరిధిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గౌరస దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆపదలో ఆడపడుచులు!

- పుణ్యక్షేత్రానికి తగ్గిపోతున్న వలస పక్షుల రాక
- మృత్యుపాశాలుగా హెచ్‌టీ లైన్లు
- పైసా ఖర్చుచేయని అటవీ శాఖ



రాజానగరం: ఏటా వలస పక్షుల ప్రస్తావన వచ్చినపుడల్లా ఠక్కున గుర్తొచ్చేవి స్థానిక ‘పుణ్యక్షేత్రం’ ఆడపడుచులే. అవునండీ.. తూర్పుగోదావరి జిల్లాలోని ఈ ‘పుణ్యక్షేత్రం’ గ్రామానికి వచ్చే పక్షులను ఆ ఊరి ప్రజలు తమ ఆడపడుచుల్లా ఆదరిస్తారు. రాజమహేంద్రవరం సమీపాన ఉన్న ఈ గ్రామానికి విహంగాల వల్లే ‘పుణ్యక్షేత్రం’ అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే గతంతో పోలిస్తే ఇక్కడకు వచ్చే పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇందుకు ఊళ్లో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లూ ఓ కారణమే. ఈ పక్షులు ఆవాసంగా ఎంచుకున్న కంచి విత్తనం చెట్లను ఆనుకున్న 33 కేవీ విద్యుత్ లైన్లు వాటి పాలిట మృత్యుపాశాలుగా మారాయి. అవి గాల్లోకి ఎగిరే సమయంలో రెక్కలు ఆ తీగలకు తగిలి అంతలోనే నేలరాలుతున్నాయి.

ఖండాంతరాలు దాటి..

ఆసియా ఖండపు ఉత్తర ప్రాంతం రష్యాలోని సైబీరియా నుంచి ఏటా క్రమం తప్పకుండా వచ్చే ఈ పక్షులను సైబీరియన్ క్రేన్స్ అంటారు. రష్యాలోని ఆర్కిటిక్ టండ్రాలో తూర్పు, పశ్చిమ జాతులుగా ఉన్న ఈ పక్షులు సంతానోత్పత్తి కోసం తూర్పు జాతులు చైనాకు, పశ్చిమ జాతులు భారత్ వైపు వలస వెళతాయి.

మృగశిర కార్తెలో రాక

తొలకరి పడే సమయం(మృగశిర కార్తె)లో వలస వచ్చి, మాఘమాసంలో స్వస్థలాలకు తిరిగి వెళ్లే ఈ పక్షులను స్థానికులు చిల్లు ముక్కు కొంగలు, నత్త కొట్టు, ఓపెన్ బిల్ బర్డ్స్ అని పిలుస్తారు. వీటి రాకతో తొలకరి పనులు ప్రారంభిస్తుంటారు. అవి రాకుంటే తొలకరి సాగదేమోనని ఆందోళన చెందుతారంటే వాటితో అనుబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. తాతముత్తాతల కాలం నుంచి వలస వచ్చే ఈ పక్షులను పుణ్యక్షేత్రం వాసులు పుట్టింటికి వచ్చే ఆడపడుచుల్లా ఆదరిస్తారు. ఇక్కడే సంతానోత్పత్తి చేస్తాయి కాబట్టి అవి తమ ఆడపడుచులని అక్కడి వారంతా అంటుంటారు. పొలాల్లో నత్తలను, పురుగులను తింటూ తమకు సాయపడుతుంటాయని రైతులు చెబుతున్నారు.

ఊరి చెరువు గట్టే ఆవాసం

గ్రామంలోని ఊరి చెరువు గట్టే వీటికి ఆవాసం. ఈ గట్టు చుట్టూ విస్తారంగా పెరిగిన కంచి చెట్లపై గూళ్లు పెట్టుకుని, సంతానోత్పత్తి చేసుకుంటాయి.

కానరాని ప్రభుత్వ చర్యలు



ఈ పక్షులు ఎంతకాలం నుంచి ఇక్కడకు వస్తున్నాయో ఎవరికీ తెలియదు. వీటి సంరక్షణకు అటవీ శాఖ ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు. టూరిజం స్పాట్ అంటూ బోర్డులైతే పెట్టారు కానీ ఒక్క రూపాయి ఖర్చు చేసింది లేదు. నాయకులు, అధికారులు ఎందరో వస్తుంటారు. కోట్లు కేటాయించి, సంరక్షణకు ఏర్పాట్లు చేస్తామంటూ ప్రగల్భాలు పలికే వారే గానీ పనులు చేసేవారు మాత్రం లేరు. దీంతో వీటి సంరక్షణ కాగితాలకే పరిమితమైంది.

– ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచ్, పుణ్యక్షేత్రం



కంచి విత్తనం చెట్లపై పక్షుల ఆవాసం

కౌలుకోలేక..

- దూసుకుపోతున్న పొగాకు ధరలు
- వచ్చే ఏడాది లీజులపై పడనున్న పెరుగుదల
- ఎకరాకు కౌలు రూ.80 వేలు
- బ్యారన్ల లీజుకు రెక్కలు
- లబోదిబో మంటున్న కౌలు రైతులు


జీడిమామిడి తోటలను తొలగించి సామిల్లుకు తరలిస్తున్న కలప


దేవరపల్లి మండలం బందపురంలోని పొగాకు సాగు భూమి

దేవరపల్లి: పొగాకు ధరలు రోజురోజుకూ అంచనాలకు అందని రీతిలో పెరుగుతున్నాయి. రైతులు మునుపెన్నడూ ఊహించని విధంగా కిలోకు గరిష్టంగా రూ.430కి లభిస్తోంది. ఈ ధర ఇటు రైతులు.. అటు కౌలు రైతులకు కాసులు కురిపిస్తోంది. ఈ పరిస్థితి ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. ఈ ప్రభావం 2025–26 ఏడాది సాగుపై పడనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ పెరగడంతో భూ యజమానులు వారి భూముల కౌలు, బ్యారన్ల లీజులు, బ్యారన్ల లైసెన్సు ధరలను అమాంతం పెంచేశారు. దీంతో రానున్న ఏడాదికి సాగుచేసే కౌలు రైతులపై ఈ ప్రభావం తీవ్రంగా పడనుంది. గత ఏడాదితో పోల్చుకుంటే భూముల కౌలు స్వల్పంగా పెరిగినప్పటికీ బ్యారన్ల లీజు, లైసెన్సు ధర పెరగడమే ఇందుకు కారణం. పొగాకు సాగు చేసే రైతుల్లో 80 శాతం కౌలుదారులే ఉన్నారు. కౌలు భూములు, లీజు బ్యారన్లు ఇప్పటి నుంచే కౌలు రైతులు హడావుడి పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు భూములను కౌలుకు, బ్యారన్లను లీజుకు తీసుకుని సిద్ధమవుతున్నారు. జీడిమామిడి, మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను తొలగించి పొగాకు సాగు చేయడానికి భూములను సిద్ధం చేస్తున్నారు. ఎకరం కొబ్బరితోటపై ఆదాయం రూ.30 వేలు, జీడిమామిడి తోటపై రూ.20 వేలు, ఆయిల్‌పామ్ పంటపై రూ.50 వేలకు మించి ఆదాయం రావడం లేదని, భూములను కౌలుకు ఇస్తే శ్రమ లేకుండా ఎకరాకు రూ.70 నుంచి 80 వేలు వస్తోందని రైతులు అంటున్నారు. పెద్ద రైతులంతా పొగాకు వ్యవసాయానికి స్వస్తి చెప్పి బ్యారన్లను లీజుకు ఇచ్చి భూముల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో అంతర పంటల ద్వారా అధిక ఆదాయం పొందుతున్నారు.

గణనీయంగా పెరగనున్న సాగు

2025–26 సంవత్సరానికి జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. 2024–25 పంట సీజన్‌లో రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో సుమారు 29 వేల హెక్టార్లలో పంట సాగు చేశారు. 2023–24 ఏడాదిలో తూర్పు, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 27 వేల హెక్టార్లలో పంట సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. బోర్డు అనుమతించిన దానికంటే అదనంగా సుమారు 20 నుంచి 25 వేల ఎకరాల్లో పంట సాగు చేసినట్టు అధికారులు లెక్కలు వేస్తున్నారు. 2023–24 సీజన్‌లో 58.25 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 80 మిలియన్ కిలోలు పండించారు. 2024–25 సీజన్‌లో 49 మిలియన్ కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 67 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరిగింది. బోర్డు ఎన్ని నిబంధనలు విధించినా వచ్చే ఏడాది 100 మిలియన్ల పంట ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.

బ్యారన్ లైసెన్స్ ధర రూ.10.50 లక్షలు

మార్కెట్లో పొగాకు ధర అనూహ్యంగా పెరగడంతో బ్యారన్ లైసెన్సు ధర రైతులకు అందుబాటులో లేకుండా పోయింది. 2022లో బ్యారన్ లైసెన్సు ధర రూ.2.60 లక్షలు, 2023లో రూ.4 లక్షలు ఉండగా, 2024–25లో రూ.10.50 లక్షలు, ప్రస్తుతం రూ.10.50 లక్షలు పలుకుతోంది. గతంలో బ్యారన్లు అమ్ముకున్న రైతులు ప్రస్తుత ధరను చూసి లబోదిబోమంటున్నారు. గత ఏడాది బ్యారన్ లీజు రూ.60 నుంచి 70 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.1.70 లక్షలు పలికింది. ప్రస్తుతం రూ.2.10 లక్షలు పలుకుతుందని రైతులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం బ్యారన్ ఖరీదు ప్రస్తుతం అద్దె పలుకుతుందని రైతులు తెలిపారు.

రెట్టింపు పలుకుతున్న కౌలు

సాగు భూమి కౌలు ధర రెట్టింపు పలుకుతుంది. గత ఏడాది ప్రాంతాన్ని బట్టి కౌలు ధర పలుకుతుంది. గోపాలపురం మండలం వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల్లో ఎకరం కౌలు రూ.80 వేలు పలుకుతుండగా, దేవరపల్లి మండలం చిన్నాయగూడెం, సంగాయగూడెం, యర్నగూడెం గ్రామాల్లో రూ.75 వేలు, దేవరపల్లిలో రూ.70 వేలు కౌలు ధర పలుకుతుందని రైతులు తెలిపారు. పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం గ్రామాల్లో నల్లరేగడి భూముల కౌలు రూ.70 వేలు పలుకుతున్నట్టు రైతులు తెలిపారు. 2022లో ఎకరా కౌలు రూ.25 వేల నుంచి 30 వేలు ఉండగా, 2023–24లో రూ.35 వేల నుంచి 42 వేలు పలికింది. 2024–25లో రూ.60 నుంచి 70 వేలు పలికిన కౌలు ప్రస్తుతం రూ.70 నుంచి 80 వేలు పలుకుతున్నాయని కౌలు రైతులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ధర్మవరం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు తొండంగి మండలం పెరుమాళ్లపురం గ్రామ పరిధిలోని కడారి పేటకు చెందిన కడారి నాగేశ్వరరావు (39), మరో వ్యక్తి నేమాల శ్రీనుతో కలసి స్కూటీపై బయలుదేరారు. కిర్లంపూడి మండలం వేలంకలోని చేపల చెరువుకు గస్తీగా ఉండేందుకు వెళ్తుండగా ధర్మవరం వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆగారు. వారి వెనుకనే రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కంటైనర్ కడారి నాగేశ్వరరావును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. నేమాల శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

పిఠాపురం: పిఠాపురంలో ఒక చెక్ బౌన్స్ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మంగళవారం 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తీర్పు ప్రకారంగా నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, అప్పు సొమ్ము చెల్లించకపోతే మరో మూడు నెలల జైలు శిక్షను ఖరారు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన కూతా ప్రకాష్‌రెడ్డి, పిఠాపురం పట్టణ వాసి గన్నేరు ఈశ్వరరావు వద్ద రూ.3,85,000 అప్పుగా తీసుకున్నాడు. దీనిపై అతడు ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో ఈశ్వరరావు 2019లో కోర్టులో కేసు వేశారు. దీనిపై 2022లో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కూతా ప్రకాష్‌రెడ్డికి 6 నెలల జైలు శిక్ష, అప్పు చెల్లించని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్షను ఖరారు చేశారు. దీనిపై ప్రకాష్‌రెడ్డి అదనపు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోగా, తాజాగా అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీ హరి మంగళవారం కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ అదే శిక్షను ఖరారు చేశారు. ఫిర్యాది తరపున బీవీవీ సత్యనారాయణరాజు వాదించారు.

రైలు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న విద్యార్థి

తుని: రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి తన రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకెళితే.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటాపురానికి చెందిన గరికిన హేమరాజు సూరంపాలెంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. రోజూ తుని నుంచి సామర్లకోట వరకూ ట్రైన్‌లో వెళ్లి అక్కడ నుంచి కాలేజీకి వెళ్తుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం జన్మభూమి ట్రైన్ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రైన్ నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో హేమరాజు రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. రైల్వే పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్


సర్పవరం పోలీసులు అరెస్ట్ చేసిన బైక్ దొంగ. చిత్రంలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కాకినాడ రూరల్: సర్పవరం పోలీసులకు మోటారు సైకిళ్ల దొంగ పట్టుబడ్డాడు. 20 ఏళ్ల వయసులోనే చాకచక్యంగా బైక్‌ల చోరీల్లో ఆరితేరాడు. సామర్లకోట మండలం పండ్రవాడకు చెందిన పెంకే తేజను సోమవారం నిందితుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను ఎస్సై శ్రీనివాస్‌కుమార్ మంగళవారం మీడియాకు తెలియజేశారు. నిందితుడి నుంచి రూ.6.5 లక్షల విలువైన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన క్రైమ్ సిబ్బంది హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, పీసీలు రవి, శ్రీనివాస్, అనిల్, చిన్నబాబు, కిశోర్‌లను సీఐ పెద్దిరాజు అభినందించారు.

ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14, 17 బాలికల ఎంపికలు వాయిదా వేసినట్లు సమాఖ్య కార్యదర్శి ఏపీడీ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. అమరావతికి 19వ తేదీన 400 మంది పీడీ, పీఈటీలకు ఆన్‌లైన్ డ్యూటీ ఉన్నందున షెడ్యూలు వాయిదా వేశామన్నారు. ఈ షెడ్యూలు 21వ తేదీ ఆదివారం పూర్తి చేస్తామన్నారు.